క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సహాయనిధి చెక్కులను ఆదివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందజేయిస్తున్నామన్నారు. ఆమె వెంట నాయకులు సత్యంగౌడ్, రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి



శ్రీనివాసులు, ప్రిన్సిపాల్

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయని రాయారావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యార్థులు తూప్రాన్‌లోని పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఎగ్జామ్ ఫీజు చెల్లించిన విద్యార్థులు సోమ వారం కళాశాలకు వచ్చి హాల్‌టికెట్‌లు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందు సెంటర్‌కు వెళ్లాలని సూచించారు.

యువతుల పెళ్లికి సాయం

నర్సాపూర్: యువతుల పెళ్లిని పురస్కరించుకుని నర్సాపూర్ మాజీ కౌన్సిలర్ లత రమేష్ తమ వంతు సహాయం అందజేశారు. నర్సాపూర్‌లోని రెండవ వార్డుకు చెందిన మంజుల, కృష్ణ దంపతుల కూతురు వివాహానికి ఆదివారం పుస్తెమట్టెలు అందజేశారు. పట్టణంలోని నాల్గవ వార్డుకు చెందిన నర్సయ్య కూతురు వివాహన్ని పురస్కరించుకుని రూ.15వేలు అందజేశారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు చేసి, ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి జయంతి



పూజలు చేస్తున్న భక్తులు

రేగోడ్(మెదక్): సుబ్రమణ్యేశ్వరస్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం ప్రాంగణంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి పలువురు దంపతులు పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పరిహార పూజల కోసం క్యూ కట్టారు.

పేదలకు సేవ చేయడం అభినందనీయం

మనోహరాబాద్ (తూప్రాన్): మెడిసిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో మెడిసిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. 58 మందికి పలు సమస్యల్లో ఆపరేషన్ అవసరమని వారికి హాస్పిటల్ వారు ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ప్రతినిధులు మాధవరావు, వెంకటరావు, వైద్యులు, నాగరాజుయాదవ్, ఐలేష్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత మనందరిది

గజ్వేల్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాల ను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వ్యాపారి మీల చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముంగిపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తే వారు మంచి పౌరులుగా ఎదిగేందుకు ఆస్కారముంటుందన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనం

- రోగకారక జీవుల కట్టడికి దోహదం
- ప్రత్యేక సూచనలిస్తున్న కొల్చారం ఏఓ శ్వేత కుమారి



పంట మార్పిడి చేయకపోవడంతో వరికి ఆశించిన చీడపీడలు

కొల్చారం(నర్సాపూర్): ఎప్పుడూ ఒకే పంట సాగు చేసే రైతులు పంట మార్పిడి వల్ల మంచి ప్రయోజనాలను పొందవచ్చని అంటున్నారు కొల్చారం మండల వ్యవసాయాధికారి శ్వేత కుమారి. వేసిన పంటలే మళ్లీ వేస్తూ బాగా నష్టపోతున్నారు.. పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గతుంది. పంట మార్పిడిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. పంట మార్పిడి వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఏళ్ల తరబడిగా వేసిన పంటనే వేస్తూ ఒకరిని చూసి మరొకరు పంటలో మార్పు లేకుండా సాగు చేయడం జిల్లాలో అధికంగా కనిపిస్తుంది. ఇలా చేయడం వల్ల లాభం కన్నా నష్టం ఎక్కువగా ఉంది.

ప్రయోజనాలు

- పంట మార్పిడితో నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి అవుతుంది.
- చీడపీడలు దూరం అవుతాయి. సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఎక్కువగా ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

సూచనలు

- జొన్న పంట సాగుచేసిన పొలంలో మిరప వేయొద్దు.
- వేరుశనగ సాగుచేసిన తర్వాత మళ్లీ అదే పంట వేసుకోరాదు. దీని వల్ల ఎర్ర గొంగళి పురుగు, శనగ పచ్చ పురుగు ఆశించవచ్చు.
- శనగ తర్వాత ఆముదంలో పంట మార్పిడి చేసుకోవచ్చు. నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, బెండ, టమాట, ఉలవలు, మినుము, పెసర పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.

జాగ్రత్తలు

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- శనగ, బబ్బెర, మినుము, ఉలవలు, పెసర పంటలు వేయడంతో నేలను కప్పి ఉంచుతాయి. కలుపు మొక్కలను నివారించవచ్చు.
- లెగ్యూమ్ జాతి (పప్పు దినుసులు) పైర్లపై వేయడం వల్ల రైజోబియం బుడిపెలు ఏర్పడతాయి.
- ఇవి గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరీకరించి నేలను సారవంతం చేస్తాయి. ఈ జాతి పంటలను పచ్చిరొట్ట ఎరువులుగా వాడుకోవచ్చు.
- పత్తి పైరును మినుము, పెసర వంటి పంటతో మార్పిడి చేయడం వలన దోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు పండించాలి.
- దీనివల్ల వేరుశనగ పంటలను ఆశించే ఆకు ముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- వరిపైరు తర్వాత పప్పు ధాన్యాల పైర్లను నూనెగింజల పైర్లను గాని పండించడం వల్ల వరి పంటను ఆశించే టుంగ్రోవైరస్, దోమపోటులను నివారించవచ్చు.

రైతులు పాటించాల్సింది

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తరువాత వేరే పంటను వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.
- వర్షాకాలం రోజులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉంటే ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసే ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

ఆదమరిస్తే.. అంతే

- నోరు తెరిచిన మ్యాన్ హోల్స్
- నిర్వహణ లోపంతో ఇక్కట్లు
- పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు



ప్రధాన వీధి మధ్యలో మూతలేని అండర్ డ్రైనేజీ

మనోహరాబాద్(తూప్రాన్): లక్షలు వెచ్చించి నిర్మించిన అండర్ డ్రైనేజీలు గ్రామ పంచాయతీ నిర్వహణ లోపంతో స్థానికులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన కాళ్ళకల్ పరిధిలో నిర్మించిన అండర్ డ్రైనేజీలు నిర్వహణ లోపంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లోని అండర్ డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు ధ్వంసమై నోరు తెరిచాయి. దీంతో రహదారి వెంట పరిశ్రమవాడలకు, గ్రామానికి వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు అదుపుతప్పి పడి గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. మ్యాన్ హోల్స్ నోరు తెరిచి రోజులు గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేయడానికి గ్రామ పంచాయతీ అధికారులు ముందుకు రావడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అండర్ డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని, మురుగు పారేలా చేయాలని కోరుతున్నారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు

అండర్ డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు ధ్వంసమై గుంతలు కనిపిస్తున్నాయి. గుంతల్లో పలువురు వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

–చందసాయికుమార్, కాళ్ళకల్

మ్యాన్‌హోళ్లకు ఆర్డర్ పెట్టాం

మ్యాన్‌హోల్ బిల్లుల కోసం ఆర్డర్ పెట్టాం.. అవి రాగానే అండర్ డ్రైనేజీలకు మరమ్మత్తులు చేయించి, మ్యాన్‌హోళ్లకు మూతలు పెట్టిస్తాం.

–ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి

ఏక్తా యాత్రపై సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న శ్రీనివాస్

కోహెడ(హుస్నాబాద్): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని 22న కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో జరుగనున్న హిందు ఏక్తా యాత్రకు తరలి రావాలి మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏక్తా యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, వెంకటేశం, నర్సయ్య, బాపురెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీశ్, రాజనీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

టేక్మాల్(మెదక్): స్థానిక ఉన్నత పాఠశాలలో 1991– 92లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తాము చదివిన పాఠశాల వెల్కమ్ బోర్డును నూతనంగా తయారు చేయించారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు బసవరాజ్, సర్పరాజ్, జుల్ఫీ, రాజు, శ్రీనివాస్, మాణిక్యం, ఊర్మిళ, మంజుల, సిద్దమ్మ, సంధ్యారాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిఖరాగ్రానికి వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

- నేడు దివ్యవిమాన రథోత్సవం
- పురవీథులలో ఊరేగనున్న స్వామివారు

వర్గల్(గజ్వేల్): వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శిఖరాగ్రానికి చేరాయి. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ఆదివారం స్వామివారికి సుదర్శన హోమం, అర్చనలు నిర్వహించారు. సోమవారం కీలకమైన విమాన రథోత్సవం ఆవిష్కృతం కానున్నది. అందుకోసం తెల్లవారుజామున 4.30ని.లకు ఆలయ మండపం వద్ద విమాన రథ ప్రతిష్ఠ చేస్తారు. అర్చకస్వాములు బలిహరణాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేలాది భక్తులు రథం లాగుతూ ముందుకు తీసుకువెళ్లే విమాన రథోత్సవ ఊరేగింపు ఉదయం 7 గంటలకు ప్రారంభంకానుంది. అంగరంగ వైభవంగా కొనసాగే ఈ రథోత్సవ వైభవం ప్రత్యక్షంగా తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తనున్నారు. అందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యేకు వివేక్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లో నిర్మించిన గురుపీఠంలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు ప్రతిష్ఠించనున్న సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ కోరారు. ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ హన్మంత్‌రావుతో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వీరభద్రుడి చరిత్ర ఒగ్గుకథ



కార్యక్రమంలో మాట్లాడుతున్న భిక్షపతి

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్పల్లి వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వీరభద్ర స్వామి చరిత్ర ఒగ్గుకథ నిర్వహించారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి సౌజన్యంతో వేములవాడ మిద్దె రాములు ఒగ్గు కళాకారుల బృందం అందరినీ అలరించారు. వారు పలు వేషధారణలతో, బోనాల ఊరేగింపుతో ఆకట్టుకున్నారు. వీరభద్రుడి జీవిత చరిత్రను పాటల రూపకంగా కథతో వివరించారు. ఈ సందర్భంగా భిక్షపతిని ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజ్, వైస్ చైర్మన్ ఈశ్వరప్ప సన్మానించారు. ఒగ్గు కథ వీక్షించేందుకు అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.



మక్తలక్ష్మాపూర్‌లో బోనాల ఊరేగింపు

బోనం.. ఘనం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో మానిక్‌ప్రభు జాతర వైభవంగా ప్రారంభమైంది. మహిళలు భక్తిశ్రద్ధలతో భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగింపుగా తరలివెళ్లి స్వామివారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమకారుడి బిడ్డకు ఆశీర్వాదం



శ్వేత వివాహానికి హాజరైన హరీష్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ దివంగత సర్పంచ్‌లు తీగుళ్ల బాబు–విజయలక్ష్మి కుమార్తె శ్వేత వివాహానికి మాజీ మంత్రి హరీష్‌రావు హాజరై ఆశీర్వదించారు. శ్వేత వివాహం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ రాజ్‌తో ఆదివారం నార్సింగి మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఉద్యమ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన శ్వేతకు మేమున్నామని ఇచ్చిన మాటను మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు హాజరై ఆశీర్వదించారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అమరులకు నివాళి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పహల్గాం అమరులకు, పాక్ కాల్పుల్లో అమరులైన వీర జవాన్లకు నివాళిగా ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సాయి శేఖర్, యాదగిరి, పెదులు, రాజు, శంకర్, భిక్షపతి, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోత కొయ్యాలంటే.. వైర్లు ఎత్తాల్సిందే

పట్టించుకోని అధికారులు



వరికోత యంత్రానికి విద్యుత్ వైర్లు తగలకుండా కర్రతో పైకి ఎత్తి పట్టిన దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదభరితంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల వ్యవసాయ పొలాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని బురదబాట శివారులో వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా చేసే వైర్లు కిందికి వేలాడుతున్నాయి. చేతికొచ్చిన వరిపంట కోసేందుకు వరికోత యంత్రాలు వస్తే కర్రలతో వైర్లను పైకి ఎత్తి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వైర్లను సరిచేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయం గురించి ఇన్‌చార్జి ఏఈ సాయిరాం దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్త స్తంభాలతో పాటు నిధుల కేటాయింపు కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.



జనసంచారం వద్ద ప్రమాదభరితంగా ఎర్తింగ్ వైర్లతో ట్రాన్స్‌ఫార్మర్

అలాగే దొంతి గ్రామంలోని గాంధీ చౌరస్తా వద్ద సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.